క్లుప్తంగా

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలన

తాంసి: భీంపూర్ మండల కేంద్రంతో పాటు అర్లి(టి) గ్రామాల్లో కలెక్టర్ రాజర్షి షా గురువారం పర్యటించారు. స్వయంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మాట్లాడి, అభ్యసన సామర్థ్యాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్లి(టి) పాఠశాల విద్యార్థులతో మాట్లాడి, చదువుతో పాటు బోధన తీరు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రతీరోజు పాఠశాలకు రావాలని సూచించారు. జీవితంలో ఉన్నతంగా రాణించాలంటే చదువులో రాణించాలన్నారు.

నేడు, రేపు స్పాట్ కౌన్సెలింగ్

ఆదిలాబాద్‌రూరల్/ఇచ్చోడ: 2024–25 విద్యా సంవత్సరంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో జూనియర్ కళాశాల, ఒకేషనల్ గ్రూప్‌లలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆ విద్యాలయాల జిల్లా కోఆర్డినేటర్ లలిత, ఇచ్చోడ కళాశాల ప్రిన్సిపాల్ వినోదసాద ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం లక్సెట్టిపేట్‌లోని బాలికల, శనివారం బాలుర సీవోఈ బెల్లంపల్లిలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగులుగా ప్రకటించాలి

బోథ్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గోపాలమిత్రలను పశుసంవర్ధక శాఖలో విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించాలని ఆదిలాబాద్ జిల్లా గోపాలమిత్రల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌లను కలిసి వినతిప్రతాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ గోకుల్, ప్రచార కమిటీ సభ్యులు మేకల ప్రవీణ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు ముందుకు రావాలి

ఇచ్చోడ: సైబర్ నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఏఎస్సై లక్ష్మినారాయణ చారి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పలువురు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోతున్నారని తెలిపారు. ఫోన్‌కు వచ్చే లింకులను క్లిక్ చేయవద్దన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రావు, పోలీస్‌సిబ్బంది ఇసాక్, సురేశ్, వినాయక్, కిష్టయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

ఇచ్చోడ: పారిశుధ్యం పనులు పకడ్బందీగా చేపట్టాలని జెడ్పీ కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలో చేపడుతున్న పారిశుధ్యం పనులను ఎంపీడీవో లక్ష్మణ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్యం ద్వారా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ప్రధాన రోడ్లపై వర్షం నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ ఉన్నారు.

ఘనంగా పీరీల పండుగ

నేరడిగొండ: మండలంలోని తేజాపూర్ గ్రామంలో గురువారం పీరీల పండుగను ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య పీరీలతో నృత్యం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులందరు పీరీలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

సమస్యలు అసెంబ్లీలో చర్చించాలి

తాంసి: నూతనంగా ఏర్పడిన భీంపూర్ మండల సమస్యలను అసెంబ్లీలో చర్చించి పరిష్కారించా లని మండల నాయకుడు ప్రవీణ్ బోథ్ ఎమ్మెల్యే అ నిల్ జాదవ్‌ను కోరారు. గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మండలంలో జూనియర్ కాలేజీ, కార్యాలయాలకు సొంత భవనాలు, అంతర్రాష్ట్ర రోడ్డు, విద్యుత్‌తో పాటు తదితర సమస్యలను లేవనెత్తి పరిష్కారించే విధంగా కృషి చేయాలని కోరారు.

బీసీ పట్టణ కార్యవర్గం ఎన్నిక

ఎదులాపురం: ఆదిలాబాద్ పట్టణ బీసీ కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నట్లు జిల్లా గౌరవ అధ్యక్షుడు అంజయ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం వివరాలు వెల్లడించారు. ప్రధాన కార్యదర్శిగా బొడిగం శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా యెల్మెల్‌వార్ సచిన్ కుమార్‌లను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సోమగారి వెంకటేశ్, యెల్మెల్‌వార్ రామ్ కుమార్, షేర్లవార్ రవీందర్, షేర్లవార్ రాజు, మల్లికార్జున్, రవి, మురళి, అమూల్, నర్సన్న, విక్రమ్, సాయికృష్ణ, అశోక్, హరీశ్, శేఖర్ పాల్గొన్నారు.

పండ్ల తోటలకు రాయితీ

- ఈ నెల చివరి వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


కజ్జర్ల శివారులో నాటిన మామిడి మొక్కలు

తలమడుగు: ప్రజల అవసరాలకు అనుకూలంగా కూరగాయలు, పండ్ల ఉత్పత్తి లేకపోవడంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మరోవైపు దిగుబడులు తగడంతో మార్కెట్లో డిమాండ్ ఏర్పడింది. ఈనేపథ్యంలో పండ్లు, కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం స్వీకారం చుట్టింది. అందులో భాగంగా జాతీయ ఉపాధిహామీ పథకంలో రైతులను పండ్ల తోటల పెంపకం వైపు మళ్లించేందుకు రాయితీలు అందిస్తుంది. ప్రతీ మొక్కకు నీటిని అందించేందుకు, సబ్సిడీపై సూక్ష్మ సేద్యపు పరికరాలు ఇవ్వనుంది. తలమడుగు మండంలోని పండ్ల తోటలకు అనువైన నేల ఉంది. ఇప్పటికే మండలంలో పెద్ద సంఖ్యలో కజ్జర్ల, దేవపూర్, బరంపూర్, పల్లి, గ్రామాలలో సాగు చేస్తున్నారు.

ఉద్యాన పంటలకు..

ఉపాధిహామీ ఉద్యానశాఖ ఆధ్వర్యంలో 14 రకాల పండ్ల తోటలు సాగు చేసేందుకు అవకాశం ఉంది. ప్రస్తుతం వాతావరణ మార్పులు పరిస్థితులు ఆరోగ్య, సంరక్షణ డెంగీ, కరోనా, వంటి పలు వైరస్‌ల వలన కలిగే అనారోగ్య లక్షణాల నుంచి సంరక్షణకు రోగ నిరోధక శక్తి పెరగాలంటే, డ్రాగన్ ఫ్రూట్, జామ, నిమ్మ, నేరడు తదితర పంటల పండ్లతో పాటు, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కూరగాయల సాగు చేసుకోవాలి. అంతర్ పంటలుగా ఆకుకూరలు, బీర, సొర, కాకర, చిక్కుడు, టమాట, దోస, మునగ, పూలు సాగు చేయవచ్చు. అర్హతలు.. ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగిన ఉండి, అనువైన భూమి, నీటి సౌకర్యం ఉండాలి. 5 ఎకరాల లోపు భూమి ఉన్న షెడ్యూల్ కులాలకు చెందిన చిన్న సన్న రైతులై ఉండాలి. రైతులకు రాయితీపై మొక్కలు, బిందుసేద్యం పరికరాలు, ఎస్సీ, ఎస్టీ, రైతులకు వందశాతం, మిగిలిన రైతులకు తొంబై శాతం

పంట	ఎకరకు మొక్కలు	ఎకరానికిఇచ్చే రూపాయలు
మామిడి	70	రూ. 54,606
నిమ్మ	110	రూ. 69,403
నారింజ	100	రూ. 63,118
జీడి మామిడి	70	రూ. 54,186
జామ	110	రూ. 70,063
సీతాఫలం	100	రూ. 1,00,986
సపోటా	60	రూ. 47,264
ఆయిల్ పాం	57	రూ. 43,946
నేరేడు	40	రూ. 31,120
ఆపిల్ బేర్	160	రూ. 77,786
దానిమ్మ	265	రూ. 1,21,499
మునగ	1000	రూ. 94,892
డ్రాగన్‌ఫ్రూట్	900	రూ. 2,50,272
కొబ్బరి	40	రూ. 31,500

రాయితీపై పరికరాలు అందజేయనున్నారు. మొక్కలు నాటిన ఏడాది నుంచి 3 నుంచి 4 ఏళ్ల వరకు నిర్వాహన ఖర్చులు ప్రభుత్వమే మంజూరు చేస్తుంది. నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక ఉద్యానవన శాఖ, సమన్వయంతో లక్ష్యం చేరుకునేలా ప్రణాళిక తయారు చేస్తున్నారు. అన్నదాతలు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల ఆఖరి వరకు లబ్ధిదారులను గుర్తించి, ఆగస్టు 15లోపు ప్రతిపాదన రూపొందిస్తారు. వచ్చే నెల వరకు మొక్కలు నాటడం, బిందుసేద్యం పరికరాలు బిగించడం పూర్తి చేయాల్సి ఉంటుంది.

మొక్కలు నాటేందుకు అనువైన సమయం

ఉపాధిహామీ పథకంలో భాగంగా 2023– 24 సంవత్సరానికి పండ్ల తోటలు పెంపకానికి ఇది అనుకూల సమయం. రైతులకు ఎలాంటి ఖర్చు లేకుండా మూడేళ్లపాటు, యాజమాన్య పద్ధతులను ప్రభుత్వమే భరిస్తుంది. అర్హత ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తులను ఏపీవో ఉపాధిహామీ కార్యాలయంలో అందజేయాలి. రాయితీని నగదు రూపంలో రైతు బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. – మేఘమాల, ఏపీవో

బహిరంగ సభ జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని ఆర్ఎస్ గార్డెన్‌లో ఈనెల 27న నిర్వహించే కులగణన సాధన యాత్ర భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కులగణన సాధన యాత్ర తలపెట్టారని, ఈనెల 27 శనివారం యాత్ర జిల్లా కేంద్రానికి చేరుకుంటుందన్నారు. అదే రోజున ఉదయం 10 గంటలకు ఆర్ఎస్ గార్డెన్‌లో బహిరంగ సభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు అంజయ్‌కుమార్, కన్నం మోహన్‌బాబు, నర్సింగ్, అశోక్, శ్రీనివాస్, రవీందర్, నర్సగౌడ్, సత్యనారాయణ, విఠల్, స్వామి, యువరాజ్, తిరుపతి, రాజు, మహేశ్వరి, గంగామణి, పద్మ పాల్గొన్నారు.

వైద్యశిబిరం నిర్వహించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాలిటీలో పనిచేసే పారిశుధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాథోడ్ నరేందర్‌ను తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అందుకు డీఎంహెచ్‌వో స్పందిస్తూ ఈనెల 30వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో కార్మికులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తామని హామీనిచ్చినట్లుగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విలాస్, ప్రధాన కార్యదర్శి సిర్రా దేవేందర్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, కార్యదర్శి మెరుగు చిరంజీవి, నారాయణరెడ్డి. శేషబాబు, తదితరులు పాల్గొన్నారు.

వదలని ముసురు


ఉధృతంగా ప్రవహిస్తున్న మామిడిగూడ వాగు


మరమ్మతు చేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం ఎడతెరిపి లేకుండా ముసురు కురిసింది. దీంతో మండలంలోని సాయినగర్ సమీపంలో గల వ్యవసాయ భూములో ఉన్న విద్యుత్ స్తంభాలు, మండల కేంద్రంలోని పూలాజీబాబానగర్‌లో చెట్లు నెలకొరిగాయి. విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే మరమ్మతులు చేసి విద్యుత్ అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ముత్నూర్ త్రీవేణి సంఘం చెరువు, ఏమాయికుంట గురుదేవ్ చెరువులు వరదనీటితో నిండిపోయాయి. మండలంలోని మామిడిగూడ, చిత్తబట్ట, జైత్రంతండా గ్రామాల మధ్య వాగులు వరద నీటితో ఉధృతంగా ప్రవహించాయి. మామిడిగూడ గ్రామంలోని పలువురు గిరిజనులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాగుదాటి ఇంద్రవెల్లి మండల కేంద్రానికి వచ్చి నిత్యావసర సరుకులు కొనుగోలు చేశారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఎదులాపురం: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మహాలక్ష్మివాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పల్లి కిషన్, మున్సిపల్ పర్యావరణ ఇంజినీర్ రవికిరణ్ అన్నారు. గురువారం పాఠశాలలో వన మహోత్సవం నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులతో సుమారు 200 మొక్కలు నాటారు. మొక్కలు పరిరక్షించాలని, అప్పుడే భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందితో పాటు ఉపాధ్యాయులు నరేందర్, రవీందర్, సతీశ్, రాజు, చంద్రశేఖర్, రజిత, మౌనిక, హరిచరణ్, గణపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నేరడిగొండ: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని వైద్య సిబ్బంది రవీందర్, హరికుమార్ గౌడ్ అన్నారు. గురువారం వాగ్దారి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. కొబ్బరి బొండాలు, కూలర్లు, పాత టైర్లలో నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వాణి, హెల్త్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి, ఏఎన్ఎంలు గంగామణి, శ్యామల, ఆశ కార్యకర్త వనిత, అంగన్‌వాడీ కార్యకర్త, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

ఇంద్రవెల్లి: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ముత్నూర్ గ్రామ సమీపంలోని త్రీవేణి సంఘం చెరువు, ఏమాయికుంట గురుదేవ్ చెరువులను పరిశీలించారు. అలాగే చిత్తబట్ట, జైత్రంతండా గ్రామాలను సందర్శించారు. ఎలాంటి సమస్య ఉన్నా.. అధికారులకు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది వెట్టి అచ్‌పత్‌రావ్, కోడప నాగోరావ్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. గురువారం మండలంలోని గాంధారి, గాజిలి గ్రామాల వాగులను పరిశీలించారు. వాగు ప్రవాహం ఉధృతంగా ఉన్నందున వాగులు దాటవద్దన్నారు. అనంతరం గ్రామాల్లో పర్యటించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో లక్ష్మణ్, ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ముదిరాజ్‌లను బీసీఏలోకి మార్చాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తలమడుగు: తెలంగాణలోని ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చాలని బీసీ సంఘ నాయకులు తహసీల్దార్ రాజ్‌మోహన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో 13శాతం జనాభా ముదిరాజులు ఉన్నారన్నారు. మత్స్యవృత్తి, పండ్ల తోటల పెంపకం, ఇతర వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. సామాజిక, ఆర్థిక రాజకీయాల్లో అత్యంత వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వం జీవో నెంబర్ 15, 2009 ప్రకారం ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు మోతే శ్రీనివాస్, రమాకాంత్, రవికాంత్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ముర్రా జాతి గేదెలను పెంచుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి కిషన్

ఇచ్చోడ: నాణ్యమైన ముర్రా జాతి గేదెలను పెంచుకోవడం ద్వారా పాల ఉత్పత్తి పెరిగి అధిక లాభాలు పొందవచ్చునని జిల్లా పశువైద్యాధికారి కిషన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డు రైతువేదికలో ఇచ్చోడ, బోథ్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, సిరికొండ మండలాల గేదెల పెంపకం కోసం ఎంపిక చేసిన స్వయం సహాయక సంఘాల సభ్యులచే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ముర్రాజాతి గేదెలు ఇక్కడి వాతావరణాన్ని తట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. ఒక్క గేదె యూనిట్ ధర రూ. 93,270 రూపాయలు అవుతుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు సుశీల్, గోవింద్‌నాయక్, మహిళా సంఘాలు సభ్యులు పాల్గొన్నారు.

సంఘాల సంస్థాగత నిర్మాణం చేపట్టాలి


మాట్లాడుతున్న ఆరెల్లి మల్లేశ్ మాదిగ

ఆదిలాబాద్‌రూరల్: ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల సంస్థాగత నిర్మాణం చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ మాదిగ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల సమావేశానికి హాజరై మాట్లాడారు. దివ్యాంగుల పింఛన్ పెంపు కోసం వీహెచ్‌పీఎస్ చేసే పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నాయకులు ఎల్లన్న, దాసరి రాంప్రసాద్, వినయ్ సాగర్, పసుల శ్రీకాంత్, ఆయుష్, పుల్లూరి ప్రణయ్, మోరె దీపక్, కాంబ్లె రాజు, అరుణ్, పరశురాం పాల్గొన్నారు.

జామ్నిలో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

జైనథ్: మండలంలోని జామ్ని గ్రామంలోని సబ్‌సెంటర్ గిమ్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా మెడికల్ ఆఫీసర్ సుచల గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అలాగే గర్భిణులకు పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఇక్రమొద్దీన్, హెచ్ఈవో అనిత, ఏఎన్ఎంలు అడెల్ల, అనసూయ, ఎల్‌టీ నిజామొద్దీన్ పాల్గొన్నారు.

పేదల అభివృద్ధికి పెద్దపీట

ఉట్నూర్‌రూరల్: సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారి పూర్తి స్థాయి ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎస్సీ, ఎస్టీ బడుగువర్గాల, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసిందని, రైతులు వ్యవసాయ రంగంలో నిలదొక్కుకొనే విధంగా ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. రూ. 2,91,159 కోట్లతో రాష్ట్ర పూర్తి స్థాయి బడ్జెట్‌ను శాసన సభలో ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారన్నారు. బడ్జెట్ కేటాయింపులు పేద ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పులు తీసుకొస్తుందన్నారు. నియోజకవర్గంలోని కడెం ప్రాజెక్టు అభివృద్ధికి రూ. 9,50 కోట్లు, నాగోబా జాతర నిర్వహణకు రూ. కోటి, సేవాలాల్ జయంతి నిర్వహణకు రూ. రెండు కోట్లు కేటాయించారన్నారు.

'రైతుల తలరాతలను మార్చే బడ్జెట్'

కైలాస్‌నగర్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ రైతుల తలరాతలను మార్చేలా ఉందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ప్రకటనలో తెలిపారు. రైతులకు భరోసా కల్పిస్తూ వ్యవసాయారంగానికి రూ.72,659 కోట్లు కేటాయించడం ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఒకేసారి రూ.31 వేల కోట్ల రైతుల రుణమాఫీ చేయడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు.

భారీ వర్షానికి కూలిన ఇల్లు


కూలిన ఇల్లు

నార్నూర్: గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని నాగల్‌కొండ గొండుగూడ గ్రామానికి చెందిన కుమ్రహన్ను ఇల్లు గురువారం కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఆహార వస్తువులు, బట్టలతో పాటు జొన్నలు, బియ్యం, పప్పులు, పూర్తిగా తడిసిపోయాయి. కనీసం తినడానికి గింజ మిగలకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు రూ. 5లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

యువజన కాంగ్రెస్ అధ్యక్ష బరిలో నిఖిల్

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన షేక్ నిఖిల్ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడి బరిలో నిలిచాడు. రాష్ట్ర వ్యాప్తంగా యువజన కాంగ్రెస్ ఎన్నికలను చేపట్టనుంది. ఇందులో భాగంగా పలువురు మండల అధ్యక్ష పదవికి ఆన్‌లైన్ ద్వారా నామినేషన్ దాఖలు చేశారు. భీంపూర్ మండలం నుంచి నిపానికి చెందిన షేక్ నిఖిల్ నామినేషన్ దాఖలు చేసి బరిలో ఉన్నట్లు తెలిపాడు.

విధుల్లో చేరిన పంచాయతీ కార్యదర్శులు

బోథ్: మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీల్లో బదిలీపై వచ్చిన నలుగురు పంచాయతీ కార్యదర్శులు బుధవారం విధుల్లో చేరారు. సొనాల గ్రామపంచాయతీ కార్యదర్శిగా వెంకటరమణ, అందూరు గ్రామపంచాయతీ కార్యదర్శిగా మహేశ్, దేవుల నాయక్ తండా గ్రామ కార్యదర్శిగా శ్రీకాంత్, పార్డి(బి) గ్రామ పంచాయతీ కార్యదర్శిగా శ్రీనివాస్‌లు బాధ్యతలు తీసుకున్నారు.

చెరువులను పరిశీలించిన అధికారులు

తలమడుగు: వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు, కుంటలు నిండుకుండలా మారడంతో గురువారం తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్ దేవాపూర్, కజ్జర్ల, రుయాడి, బరంపూర్, లక్ష్మీపూర్ చెరువులను పరిశీలించారు. రైతులకు సలహాలు సూచనలు చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సిరికొండ: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని రాజంపేట్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సీజనల్ అనారోగ్యానికి గురైతే వైద్యులను సంప్రదించాలన్నారు. వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. కానిస్టేబుల్స్ అర్జు న్, పాల్గొన్నారు.

మాజీ సీఎంను కలిసిన బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ: అసెంబ్లీలో గురువారం జరిగిన బడ్జెట్ సమావేశానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద కేసీఆర్ నిర్వహించిన సమావేశంలో ఆయనతో కలిసి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా రాంప్రసాద్ గురువారం ఉట్నూర్ ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద ఎంపీడీవోగా విధులు నిర్వర్తించిన ఆయన బదిలీపై ఉట్నూర్‌కు రావడం జరిగిందన్నారు. మండల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

సన్మానం

సిరికొండ: బదిలీపై వెళ్తున్న మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు కాంతయ్య, భాస్కర్, శ్రీనివాస్, లక్ష్మిలను మండల బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు గురువారం శాలువాతో సన్మానించారు. మాజీ సర్పంచ్ ఓరగంటి పెంటన్న, తోకల చందు, బియ్యాల మల్లేష్, లతీఫ్, గోర్ల రాజన్న, ఎల్పుల మల్లేష్, రాజు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు వివక్ష

ఆదిలాబాద్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం గత రెండు రోజుల కిందట ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రంపై వివక్ష చూపిందని బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి దేవిదాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. గతంలో కూడా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899